క్లుప్తంగా

సత్రశాలలో కార్తిక మాస పూజలు



సత్రశాల(రెంటచింతల): కార్తీక మాసం సందర్భంగా అతి పురాతనమైన ప్రముఖ శైవక్షేత్రం సత్రశాలలో గంగా భ్రమరాంబికాదేవి సమేత మల్లికార్జునస్వామి దేవస్థానానికి సోమవారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ప్రధాన అర్చకులు చిట్టీలా శివశర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాలదారులు, భక్తులు కృష్ణా నదిలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేవస్థాన ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన స్ఫటిక శిలింగం వద్ద, స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎంతో చరిత్ర కలిగిన మల్లిఖార్జున స్వామి దేవస్థానంను దర్శించుకోవడం వలన ప్రశాంతమైన జీవితం లభిస్తుందని భక్తులు నమ్మకం. మహాన్నదానం చేశారు. ఈవో గాదె రామిరెడ్డి, దేవస్థానం కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



వెల్దుర్తి: సీజనల్‌లో వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి, తగు జాగ్రత్తలు తీసుకుంటే నివారణ సులభమని శ్రీకృష్ణ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ గుర్రం రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని కండ్లకుంట గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. సీజనల్ వ్యాధుల నివారణలో పరిసరాల పరిశుభ్రత పాటించి, కాచి వడపోసిన నీటిని తాగాలని కోరారు. రైతులు, రైతు కూలీలు పొలాల్లో మందులు పిచికారి చేసేటప్పుడు ముక్కు, నోటికి మాస్కును ధరించాలన్నారు. చేతులను శుభ్రంగా సబ్బుతో కడుక్కొని పనులు చేయాలన్నారు. ముఖ్యంగా ధూమపానం, పొగాకు దూరంగా ఉండాలని సూచించారు. 360 మంది రోగులకు ఉచితంగా ఊపిరితిత్తులు, గుండె, గ్యాస్ సమస్యలపై పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఈసీజీ, షుగర్, యూరిన్, రక్త పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత జ్ఞాన ప్రచారం



మాచవరం: కార్తిక మాసాన్ని పురస్కరించుకొని ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలోని మోర్జంపాడు గ్రామంలో భగవద్గీత జ్ఞాన ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక దీపం, విశిష్ఠత అంతరార్థాన్ని తెలియజేసారు. దేవాలయంలోకి ప్రవేశించినప్పుడు బాహ్య విషయాలు వీడి, ఆత్మశుద్ధితో దైవాన్ని ప్రార్థిస్తే దైవానుగ్రహం పొందుతారని తెలియజేశారు. ప్రముఖులు రచించిన దైవ గ్రంధాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కటికం సైదారావు, యుద్దనపూడి వీరాంజినేయులు, అరుణ, గోపి, అనురాధ, గంగయ్య, శ్రీను, రాఘవ కార్తీక్, నారాయణమ్మ, వెంకటలక్ష్మి, వీరయ్య, రామాంజినేయులు పాల్గొన్నారు.

పత్తికొనుగోలు కేంద్రం ప్రారంభం

నాదెండ్ల: గణపవరంలోని వెంకటకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ (కాటన్‌మిల్లు)లో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభమైంది. బయ్యర్ బి రమేష్‌బాబు పత్తికొనుగోళ్ళు ప్రారంభించారు. తేమ శాతం 8 వరకూ ఉన్న పత్తికి క్వింటా రూ.7521లు గరిష్ఠంగా, 12 శాతం ఉన్న పత్తికి రూ.7200లు చొప్పున రైతులకు చెల్లించారు. 13 శాతం దాటిన పత్తిని తిరస్కరించారు. ఈ సందర్భంగా బయ్యర్ మాట్లాడుతూ రైతులు నిబంధనలకు అనుగుణంగా పత్తిని తరలించి మంచి ధర పొందాలని కోరారు. కాయ ఉన్న పత్తి రైతులు విడిల్చి ఆరబెట్టి గన్నీబ్యాగులు లేదా లూజుగా గానీ తరలించాలని కోరారు. ఐదు రోజుల అనంతరం రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేయనున్నట్లు తెలిపారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

బొల్లాపల్లి : అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా తగు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫ్రైడేను డ్రైడేగా పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పి. శంకర్‌నారాయణ, ఎంపీహెచ్‌ఈవో ఎస్. రవి, పీహెచ్‌ఎన్. పద్మావతి, ఎంపీహెచ్‌ఎస్ సుమతి, ఏఎన్‌ఎంలు, ఆశలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

నడుస్తూ..వ్యాధులకు దూరంగా వెళ్దాం!

- ప్రతి రోజు 40 నిమిషాల నడక ఆరోగ్యానికి రక్ష
- మధుమేహం, బీపీ అదుపులో ఉంచే మంత్రం
- వ్యాయామంతో దరిచేరని రోగాలు



చెరువు చుట్టూ ఉన్న వాకింగ్ ట్రాక్



పిడుగురాళ్ల పెద్ద చెరువు వాకింగ్ ట్రాక్‌పై నడుస్తున్న వాకర్స్.

పిడుగురాళ్ల: నడకతో ఆరోగ్యం పదిలంగా ఉంటుంది. రోజులో 40 నిమిషాల నడక జీవితానికి ఎంతో మేలు చేస్తుంది. అటువంటి నడకకు నేటి యువత చాలా దూరమవుతోంది. సోషల్ మీడియా ప్రపంచంలో మగ్గుతూ.. వ్యాయమాన్ని నిర్లక్ష్యం చేస్తోంది. వీడియో గేమ్స్, రీల్స్ మోజులో పడి పక్క మనిషిని సైతం పట్టించుకోలేనంత బిజీగా మారిపోతున్నారు. ప్రతి రోజు 40 నిమిషాల నడకతో రక్త ప్రసరణ వ్యవస్థ మెరుగుపడుతుంది. వ్యాయామంతో మరో 10 ఏళ్లు ఎక్కువ బతికే అవకాశాలు మెండుగా ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మానసికంగా, శారీరంకగా మనిషి ఎంతో ఉత్సాహంగా ఉంటాడు. మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులలను ధరిచేరకుండా చూసుకోవచ్చు. అందుకే ప్రతి ఒక్కరు నడకను అలవాటు చేసుకుంటూ ఆరోగ్యం అరచేతిలో పెట్టుకున్నట్లే. నేటి యువత ప్రతి రోజు ఆరోగ్యం కోసం ఒక గంట సమయాన్ని కేటాయించి, వారి ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సర్వరోగ నివారణి నడక



నడక సర్వ రోగాల నివారణిగా పనిచేస్తుంది. అందుకే గత పదేళ్లుగా నేను రోజుకు కనీసం 40 నిమిషాల పాటు వాకింగ్ చేస్తున్నాను. సాయంత్రం వేళ స్కూల్ సమయం ముగియగానే.. పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న వాకింగ్ ట్రాక్‌పై వాకింగ్ చేస్తున్నాను.

– టి.నాగరాజు, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు, పిడుగురాళ్ల

నడవటం వల్ల ఆరోగ్యం



నేను ప్రతి రోజు వాకింగ్ చేస్తూ ఉంటాను. గతంలో ఆరోగ్య సమస్యలు ఉండేవి. ప్రతి రోజు వాకింగ్ చేయడం వలన ఆరోగ్య సమస్యలు దూరమయ్యాయి. ఇప్పుడు ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్నాను.

– గోపరవు శ్రీనివాసరావు, పిడుగురాళ్ల వాసి

అదుపులో బీపీ, షుగర్



నేను ప్రతి రోజు 40 నిమిషాలకు పైగానే వాకింగ్ చేస్తున్నాను. నాకు షుగర్, బీపీ సమస్యలు ఉన్నాయి. నడక నడవకుండా ఉంటే షుగర్ లెవల్స్ భారీగా పెరుగుతాయి. రెగ్యులర్‌గా నడక నడిస్తే షుగర్ లెవల్స్ యధావిధిగా కంట్రోల్‌లో ఉంటాయి.

– షేక్ మమ్మద్ మూసా, రిటైర్డ్ హిందీ మాస్టర్, పిడుగురాళ్ల

ఆరోగ్యం కాళ్లలోనే..



నేను రోజు ఉదయం, సాయంత్రం పది కిలో మీటర్లు నడుస్తాను. నడక వల్ల నాకు మానసిక సమస్యలు దూరమై ఎంతో ఉల్లాసంగా ఉంటున్నాను. ఇటీవలే నాకు ప్రమాదం జరిగి అనారోగ్యానికి గురయ్యాను. నేను వాకింగ్ చేయటం వల్ల ఆరోగ్యంగా ఉన్నాను. అందుకే ప్రతి ఒక్కరూ నడవాలి.

– లింగా చలపతి రావు, పిడుగురాళ్ల

ప్రజలపై భారం మోపడం సరికాదు



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

పిడుగురాళ్ల: కూటమి ప్రభుత్వం వచ్చిన ఐదు నెలలకే సామాన్యులపై భార మోపడం సరికాదని సీపీఎం మండల కన్వీనర్ తెలకపల్లి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని సుందరయ్య కాలనీలో సోమవారం ప్రజా పోరు ప్రచార యాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు కూటమి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందరన్బంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు తాము వస్తే ధరలు తగ్గిస్తామని, కరెంట్ చార్జీలు పెంచబోమని పలు హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు కాకపోయినప్పటికి ప్రజలపై భారం మొపటానికి సిద్ధమవుతోందన్నారు. విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో పెంచేందుకు ప్రతిపాదనలు చేస్తుందని, అలాగే సామాన్యుడి నడ్డి విరిచే విధంగా నిత్యావసర ధరల సరుకులు కొనలేక పేద ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక సమస్యల వలన భవన నిర్మాణ కార్మికులు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పట్టణ శివారు కాలనీలో ఒక్కో ఇంటికి రూ.700 నుంచి రూ. వెయ్యి వరకు ఇంటి పన్ను వేస్తున్నారని, ఇంటింటికి కొళాయి పేరుతో గత ప్రభుత్వం ప్రాంభించిన మంచినీటి పథకం నేటికి సుందరయ్య కాలనీకి అమలు కాలేదన్నారు. ఈ ప్రాంతంలో వీధిలైట్లు, సీసీ రోడ్లు వెంటనే వేయాలన్నారు. ఈ నెల 14న తహసీల్దార్ కార్యాలయం కాలనీ వాసులు వద్ద ధర్నాలో పాల్గొన్నాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో షేక్ సిలార్, నాగేశ్వరరావు, ఫాతిమా, తిరుమలయ్య, సైదాబి, చెత్తాబి, పార్వతి, మస్తాన్, పుల్లయ్య, భాస్కర్, పేరయ్య తదితరులు పాల్గొన్నారు.

సచ్చిదానందం ఉపాధ్యాయ శిఖరం



నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

తుమ్మకోట(రెంటచింతల): స్వర్గీయ అక్కిరాజు సచ్చిదానందరావు ఉపాధ్యాయ శిఖరమని ఆయన కుమార్తె కుసుమ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అక్కిరాజు ఫౌండేషన్ ద్వారా ఆయన శిష్యులు రూ. 2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సైకిల్ స్టాండ్‌ను ఆమె ప్రారంభించారు. తుమ్మకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రప్రథమ ప్రధానోపాధ్యాయులుగా తన తండ్రి చేసిన సేవలు ఇప్పిటికీ పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు గుర్తు చేసుకోవడం చాలా సంతోషకరమన్నారు. అనంతరం అక్కిరాజు సచ్చిదానంరావు జీవనయానం సచ్చిదానందం పుస్తకాన్ని, అక్కిరాజు శ్రీహరి రచించిన సచ్చిదానందం...ఒక మహోన్నతోపాధ్యాయ శిఖరం పుస్తకాన్ని పూర్వ ఉపాధ్యాయులు రాధాకృష్ణ మూర్తి ఆవిష్కరించి మాట్లాడారు. ముందుగా పాఠశాలలో ఏర్పాటు చేసిన సచ్చిదానందం విగ్రహం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సచ్చిదానందం కుమారులు చంద్రమౌళి, సుధాకర్, పూర్వ ఉపాధ్యాయులు సీతారామయ్య, పూర్వ విద్యార్థులు దాస్యం శ్రీనివాస రావు, షంషుద్దీన్, వరలక్ష్మి, హెచ్‌ఎం రామమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

కారెంపూడి: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల అధికారులు సోమవారం తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించారు. పల్నాటి వీరారాధన ఉత్సవాలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఉత్సవాలకు వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాలని అర్జీలు వచ్చాయి. గత అనుభవాల దృష్ట్యా నాగులేరులో స్నానాలు ఆచరించేందుకు వీలుగా నాగులేరు నీటి పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పల్నాటి వీరుల ఆయుధాల(దైవాలు)కు పూజ కట్టుకునే నాగులేరు గంగధారి పడమర వైపు కూడా మెట్లు నిర్మించాలని, వీరాచారవంతులు విశ్రమించేందుకు వీలుగా వీరుల గుడి వాగు పరిసరాలను పరిశుభ్రంగా మార్చాలని కోరారు. మరుగుదొడ్ల సమస్యలను, వీరుల గుడి ఆవరణ, ప్రధాన రహదారిలో విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని వివరించారు. నాగులేరు బ్రిడ్జిపై పాడైపోయిన ఫుట్‌పాత్‌కు మరమ్మతులు చేపట్టాలని కోరారు. వీటితో పాటు మరో రెండు అర్జీలు వచ్చాయి. ఎంపీడీఓ జి.శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జి తహసీలాస్దరు ఆర్.వెంకటేశ్వర్లు నాయక్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

13, 14న శిక్షణ కార్యక్రమాలు

మాచవరం: జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈ నెల 13, 14 తేదీలల్లో రెండు రోజుల పాటు మండల స్థాయిలో ప్రజా ప్రతినిధులకు, గ్రామైఖ్య సంఘ అధ్యక్షులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంసీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సంస్థలలో ప్రణాళికల రూపకల్పన, అధికారాల బాధ్యతలు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రతిపాదన ప్రణాళికలు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేశారు. మండలంలోని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులు తప్పని సరిగా హాజరు కావాలని తెలిపారు.

మా ప్రాంతంలో మద్యం షాపు వద్దు

ఆర్యవైశ్య మహిళల వినతి



డీటీ శర్మకు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు, పాలక మండలి సభ్యులు

పిడుగురాళ్ల: తమ ప్రాంతంలో బ్రాందీ షాప్‌కు అనుమతి ఇవ్వొద్దని ఆ ప్రాంత వాసులు, ఆర్య వైశ్య మహిళలు, దేవస్థాన పాలక మండలి సభ్యులు సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్‌శర్మకు వినతి పత్రాన్ని అందజేశారు. పిడుగురాళ్ల పట్టణంలోని జానపాడు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడి సమీపంలో బ్రాందీ షాప్ ఏర్పాటు చేసేందుకు అక్కడి గృహంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే దేవాలయం, విద్యాలయం సమీపంలో బ్రాందీ షాపులకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వకూడదు. ఈ ప్రాంతంలో అధికారికంగా అనుమతులు ఇవ్వొద్దని ముందస్తుగా వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళలు, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.

ఆడిటోరియం ప్రారంభం



ఆడిటోరియంను ప్రారంభిస్తున్న చైర్మన్ షేక్ చాంద్‌పాషా

మాచర్ల: పేద, మధ్య తరగతి ప్రజలు అభివృద్ధి కోసం, విద్యార్థుల ఉన్నతికి బిగ్ హెల్ప్ ఫర్ ఎడ్యుకేషన్ సహాయ సహకారాలందిస్తుందని చైర్మన్ షేక్ చాంద్‌పాషా తెలిపారు. సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో రూ.3.50లక్షల వ్యయంతో నిర్మించిన ఆడిటోరియంను ఆయన ప్రారంభించారు. ప్రాజెక్టు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తాటి భాస్కర్‌బాబు మాట్లాడుతూ తమ ప్రాజెక్టు ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో 1,500ల మందికి పైగా దత్తత తీసుకొని, వారి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నామన్నారు. ప్రాజెక్టు మేనేజింగ్ ట్రస్టీ మాటూరి సరోజినీ మాట్లాడుతూ బాలికల పాఠశాలలోనూ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించామన్నారు. దాని ద్వారా విద్యార్థినులకు కుట్టు మిషన్ ద్వారా ట్రైనింగ్ ఇప్పిస్తున్నామన్నారు. దాని ద్వారా వారి భవిష్యత్తు సజావుగా సాగేందుకు దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసు అడ్మిన్ శ్రీ శంకరయ్య, మేనేజర్ ధనలక్ష్మి, హెచ్‌ఎంలు రామారావు, సకీనా, డాక్టర్ కె.రామకోటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై మారణాయుధాలతో దాడి

దుర్గి: ముటుకూరు గ్రామానికి చెందిన గోపవరపు రాజేష్‌పై ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు వ్యక్తులు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. కుటుంబ సభ్యులు వివరాల మేరకు.. తేరాల గ్రామానికి చెందిన చౌకాల సాయిబాబా, కుటుంబ సభ్యులు దాడి చేసి, గాయపరిచినట్లు తెలిపారు. కొన్ని రోజుల క్రితం ఆర్థిక లావాదేవీలు విషయంలో స్వల్ప వివాదం చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న సాయిబాబా, అతని కుటుంబ సభ్యులు అర్ధరాత్రి సమయంలో రాజేష్ ఇంటిపై మారణాయుధాలతో దాడి చేశారని చెప్పారు. అదే సమయంలో రాజేష్, కుటుంబ సభ్యులు కేకలు పెట్టడంతో చుట్టు పక్కల వారు, బంధువులు రావడంతో దాడికి పాల్పడిన వారు పారిపోయారని పేర్కొన్నారు. క్షతగాత్రుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కరాటే పోటీల్లో సత్తా చాటిన శావల్యాపురం విద్యార్థులు



పతకాలు సాధించిన విద్యార్థులతో సంసిద్ స్కూలు ఉపాధ్యాయులు

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం అభినందనీయమని సంసిద్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒంటేరు నాగ సురేష్ అన్నారు. మండలంలోని కనమర్లపూడి గ్రామ పరిధిలో సంసిద్ పాఠశాల్లో క్రీడాల్లో పతకాలు సాధించిన విద్యార్థులతో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈనెల 10న గుంటూరు జిల్లా మంగళగిరిలో జరిగిన 9వ రాష్ట్ర స్థాయి ఇన్విటేషనల్ జపాన్ షితో ర్యూ కరాటే స్కూల్ శుకొకై ఇజుషి వారి సారధ్యంలో 2024 పోటీల్లో సంసిద్ స్కూలు విద్యార్థులు సత్తా చూపటం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈపోటీల్లో సంసిద్ పాఠశాల విద్యార్థులు 14 బంగారు పతకాలు,8 రజతాలు, 8 కాంస్య పతకాలు సాధించటం మంచి శుభాపరినామమన్నారు. ఈకార్యక్రమంలో కరాటే మాస్టర్ (బ్లాక్ బెల్ట్ సెకండ్ డాన్) ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికపై యువకుల అసభ్య ప్రవర్తన

రెంటచింతల: మండలంలోని మంచికల్లు గ్రామంలో ఓ బాలికపై అదే గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధితురాలి తండ్రి సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి తెచ్చారు. ఈ నెల 5వ తేదీన గ్రామంలోని నాగమయ్య స్వామి పుట్టవద్ద జరిగిన కోలాట ప్రదర్శనను చూడదానికి తన కుమార్తె స్నేహితురాలితో కలిసి వెళ్లిన సమయంలో గ్రామానికి చెందిన ఐదుగురు యువకులు అసభ్యకరంగా ప్రవర్తించినట్లు సోషల్‌మీడియా ద్వారా వాపోయి తన కుమార్తెకు న్యాయం చేయాలని కోరారు.

– ఈ విషయమై రెంటచింతల ఎస్ఐ సీహెచ్ నాగార్జున సోమవారం ఓ పత్రిక ప్రకటనను విడుదల చేశారు. ఈ నెల 10న స్థానిక పోలీసుస్టేషన్‌లో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రామంలో పలువురిని విచారించినట్లు తెలిపారు. కోలాట ప్రదర్శనకు వెళ్లిన బాలికతో కలిసి వెళ్లిన స్నేహితురాలిని అదే గ్రామానికి చెందిన 16 ఏళ్ల బాలుడు ఆమెతో నీ స్నేహం తగ్గించుకోమని చెప్పగా.. ఈ విషయంపై బాధితురాలైన బాలిక బాలుడిని దూషించిన నేపథ్యంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో ఐదుగురు యువకులు ఉన్నారనేది పూర్తిగా అవాస్తవం అన్నారు. ఇలాంటి అవాస్తవు, ఊహాజనితమైన విషయాలను సోషల్ మీడియాలో పెట్టడం నేరమని అట్టివారిపై తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్ఐ హెచ్చరించారు.

రేపు, ఎల్లుండి మంచినీటి సరఫరాకు అంతరాయం

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలో రెండు రోజుల పాటు మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, పట్టణ ప్రజలు ఈ అసౌకర్యానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంచినీటి సరఫరా లైన్‌కు మోర్జంపాడులోని గన్నేరు వాగు వద్ద లీకులు ఏర్పడటంతో మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ నెల 13, 14 తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 15న ఉదయం నుంచి మంచినీటి సరఫరా పునఃప్రారంభం జరుగుతుందని తెలిపారు.

సంస్కృతికి ప్రతీక వనభోజనాలు



వేడుకలో పాల్గొన్న భవిత సెంటరు విద్యార్థులు

శావల్యాపురంః కార్తికమాసంలో వన భోజనాలు నిర్వహించుకోవటం సంస్కృతి సంప్రదాయాలకు నిలయంగా ఉంటుందని ఎంఈవో పుసులూరి లలితాకుమారి అన్నారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీఅడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో భవిత సెంటరు విద్యార్థులచే ప్రత్యేకంగా వన బోజనాలు కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 లలితాకుమారి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు వలన ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులు ఉల్లాసంగా ఉత్సాహంగా ఉంటారన్నారు. పండుగల విశిష్టత తదితర వాటిపై అవగాహన కల్గియుంటారన్నారు. ఈకార్యక్రమంలో ఎంఈవో-01 మద్దికుంట సాంబశివరావు, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి,భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్‌రెడ్డి, పార్వతి, ఆర్. నాగమల్లేశ్వరి, ఎంఆర్‌సీ సిబ్బంది తివిక్రమ్, సీఆర్‌పీలు రావూరి శివప్రసాదు, ఏలిక శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే చోరీ

రూ.2లక్షల నగదు, 13 సవర్ల బంగారం మాయం



మాచవరం: ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే చోరీ జరిగిన సంఘటన మండలంలోని వేమవరం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జక్కుల సైదులు కూలీల మేస్త్రీగా పని చేస్తుంటాడు. రోజులాగే ఉదయాన్నే కూలీలను తీసుకొని పొలం పనులకు వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సమయానికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగలగొట్టి అందులో ఉన్న రూ.2 లక్షల నగదు, 13 సవర్ల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు అంగన్‌వాడీ కార్యకర్తల సమావేశం

పిడుగురాళ్ల: మండల కేంద్రమైన మాచవరంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో రుక్సానా బేగం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పిడుగురాళ్ల, మాచవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వెల్ఫేర్ సెక్రటరీలందరు హాజరు కావాలని సూచించారు.

ధర్నాను జయప్రదం చేయండి

రొంపిచర్ల: మండల కేంద్రంలో ప్రజా సమస్యలపై 14వ తేదీన నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ సరికొండ వెంకటేశ్వరరాజు పిలుపునిచ్చారు. మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా పోరు ప్రచార యాత్ర సందర్భంగా కరపత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పెంచిన విద్యుత్ ఛార్జీలు, నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని ఆయన డిమాండ్ చేశారు. 14వ తారీకు ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంతగుడిపాడు సీపీఎం శాఖ సభ్యులు కొత్తపల్లి యాకోబు, మూకుడు పాపయ్య, రొంపిచర్ల సీపీఎం శాఖ కార్యదర్శి అంగులూరి ఫణీంద్ర, పలపల రామిరెడ్డి, వంబా కోటేశ్వరరావు, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని.. మనస్థాపంతో..

రెంటచింతల: మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన ఓ యువకుడు ఉద్యోగం కోసం దళారులకు ఇచ్చిన నగదు, ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపం చెంది అదృశ్యమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొత్త అఖిల్‌కుమార్ నాలుగేళ్ల కిందట బీటెక్ పూర్తిచేసి, రెండేళ్లు ఉద్యోగం చేశాడు. అఖిల్‌కుమార్ చేస్తున్న ఉద్యోగం నుంచి కంపెనీ తొలగించడంతో రెండేళ్లుగా ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఉద్యోగం కోసం దళారులకు లక్షలాది రూపాయులు ఇచ్చాడు. సమయం గడుస్తున్నా ఇచ్చిన నగదు, ఉద్యోగం రాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఉదయం 11 గంటల సమయంలో ఇంట్లో తన సెల్‌ఫోన్ పెట్టి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయాడు. మనస్థాపానికి గురైన అఖిల్‌కుమర్ ఏమైన అఘాయిత్యం చేసుకున్నాడోనని అనుమానంతో కుటుంబ సభ్యులు మంచికల్లు సమీపంలోని బుగ్గవాగు పరిసర ప్రాంతాలలో గాలించారు. అక్కడ ఏలాంటి ఆచూకి లభించకపోవడంతో అఖిల్‌కుమార్ తండ్రి కొత్త ఆంజనేయులు పోలీసులకు రాత్రి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలిస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్ నాగార్జున తెలిపారు.

నైపుణ్య గణనపై సచివాలయ సిబ్బందికి శిక్షణ



నకరికల్లు: ఉచితంగా నైపుణ్యాలపై శిక్షణనిచ్చి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య గణన దోహద పడుతుందని ఎంపీడీవో జి.కాశయ్య అన్నారు. నైపుణ్య గణన చేపట్టనున్న సచివాలయ సిబ్బందికి స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో వారం రోజుల్లోగా నైపుణ్య గణన కార్యక్రమం ప్రారంభించాలన్నారు. శిక్షణ పొందిన సచివాలయ సిబ్బంది 15 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు గల వారి వివరాలు సేకరించాలన్నారు. ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో ఆధార్ ఓటీపీ ద్వారా 45 రకాల కాలమ్స్ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి నివేదిక పంపాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ కె.వి.ఎస్.ప్రసాద్, నైపుణ్య శిక్షణాధికారి ఇ.రామకృష్ణారెడ్డి, సీడాప్ జేసీవో వై.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.